
సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



వెల్లివిరిసిన భక్తిభావం

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివెరిసింది. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో జిల్లా కేంద్రాల్లోని ఆలయాలకు భారీగా తరలివచ్చి పూజలు చేశారు.



మిడ్‌మానేరులో 12 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో సోమవారం నాటికి 12.591 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ నుంచి 8వేలు, గాయత్రీ పంప్‌హౌస్ నుంచి 9,450 క్యూసెక్కుల వరద వస్తోంది.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

చినుకు ఆగదు.. చెరువు నిండదు



ఇది ముస్తాబాద్‌లోని లింగంకుంట. భారీ వర్షాలు పడితేనే ఈ కుంట నిండే పరిస్థితులు ఉన్నాయి. కొద్దిపాటి నీళ్లతో లింగంకుంట బోసిపోయి కనిపిస్తోంది. ఒక్క లింగంకుంటనే కాదు జిల్లా వ్యాప్తంగా 656 చెరువులు, కుంటలు ఉండగా 37 చెరువుల్లోనే నీరు నిండి మత్తడి పారుతున్నాయి. మిగతా 619 చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి.



ఇది గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు. కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పాల్వంచ, కూడెల్లివాగులు పారడంతో ఎగువ మానేరులోకి నీరు వచ్చి చేరింది. 33 అడుగుల సామర్థ్యం ఉన్న ఎగువ మానేరులో 31 అడుగుల మేరకు నీరు చేరింది. మరో రెండు అడుగుల నీరు చేరితే మత్తడి దూకుతుంది. మూడు నెలల పాటు మానేరు పారితేనే జిల్లాలో రెండో పంటకు సాగునీరు లభిస్తుంది. 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఎగువ మానేరు మత్తడి ఎప్పుడు దూకుతుందోనని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు.

ఇది కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు. 19 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న మూలవాగులో ప్రస్తుతం 15 అడుగుల నీరుంది. మరో ఐదు అడుగులకు చేరితే మత్తడి గుండా వరదనీరు వాగులోకి వస్తుంది. ఆ వరదనీరే వేములవాడ పక్కనే ఉన్న మూలవాగులో పారుతుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా 2,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కానీ నిమ్మపల్లి మూలవాగు జలాశయం ఇంకా నిండలేదు.



- జాడలేని భారీ వర్షాలు
- నీటి వనరులు వెలవెల
- 656 చెరువుల్లో నిండినవి 37
- రెండు అడుగుల దూరంలో ఎగువమానేరు మత్తడి
- ఐదు అడుగుల దూరంలో నిమ్మపల్లి మూలవాగు

సిరిసిల్ల: జిల్లాలో నిత్యం చినుకులు పడుతూనే ఉన్నాయి. వాతావరణం తేమగానే ఉంటోంది. అయినా నీటివనరులు వెలవెలబోతున్నాయి. వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమై కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ భారీ వర్షం మాట అటుంచితే కనీసం మోస్తరు వాన కూడా కురువలేదు. ఫలితంగా నీటి వనరులు ఇప్పటికీ నీరు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. నిత్యం ముసురు వర్షం కురుస్తున్నా వాగు పారింది లేదు.. చెరువు నిండింది లేదు.

ఇల్లంతకుంటలో అత్యధికం

ఇల్లంతకుంట మండలంలో అత్యధికంగా 14 చెరువులు మత్తడి దూకుతుండగా.. బోయినపల్లి, వేములవాడ, చందుర్తి మండలాల్లో ఒక్కటి కూడా నిండలేదు. గంభీరావుపేటలో ఐదు, ఎల్లారెడ్డిపేటలో ఆరు, తంగళ్లపల్లిలో నాలుగు, వేములవాడ అర్బన్‌లో రెండు, కోనరావుపేటలో నాలుగు, ముస్తాబాద్‌లో రెండు చెరువులు మత్తడి దూకుతున్నాయి.

లోటు వర్షపాతమే..

జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సాధారణ వర్షపాతం 466.4 మిల్లీమీటర్లు కాగా.. ఇప్పటి వరకు 470.0 మిల్లీమీటర్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి 555.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గత ఏడాదితో పోల్చితే తక్కువ వర్షం పడగా.. సాధారణం కంటే ఎక్కువే పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే కనిపిస్తుంది.

సాగునీటి వనరులు.. నీటి నిల్వలు(టీఎంసీలలో..)

జలాశయం	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
మధ్యమానేరు(మాన్వాడ)	27.55	11.812
అన్నపూర్ణ(అనంతగిరి)	3.50	1.28
మల్కపేట రిజర్వాయర్	3.00	0.70
ఎగువమానేరు(నర్మాల)	2.00	1.60

చిన్ననీటి వనరులు ఇలా..

మొత్తం చెరువులు	656
0–25 శాతం నిండినవి	263
25–50 శాతం నిండినవి	147
50–75 శాతం నిండినవి	146
75–100 శాతం నిండినవి	63
మత్తడి దూకుతున్నవి	37

భారీ వర్షాలే లేవు..



ఈ సీజన్‌లో ఒక్క భారీ వర్షమైనా కొట్టలేదు. మా ఊరి చెరువు నిండితేనే పంటలకు నీరు అందుతుంది. సిరికొండ, తాటిపల్లి, జినిగ్యాల అడవుల్లో భారీ వర్షాలు పడితే మా చెరువు నిండుతుంది. ముసురు వర్షంతో కొద్దిగా నీరు చేరింది. మూలవాగు ప్రాజెక్టు నిండాలంటే భారీ వర్షాలు పడాలి.

– దొంతరవేని శ్రీనివాస్‌గౌడ్, నిమ్మపల్లి

ప్రాజెక్టు నీళ్ల కోసం చూస్తున్నాం



మానేరు ఉండడం మాకు సంతోషం. కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో ఎగువ మానేరులోకి నీరు చేరుతోంది. మానేరు నిండితేనే మాకు పొలాలకు నీరు వస్తుంది. అధికారులు కాల్వలకు నీరు ఎప్పుడు విడుస్తారోనని ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే వరి నాట్లు వేసుకున్నాం. మంచి వర్షాలు లేక భూగర్భ జలాలు పెరగలేదు.

– ఎల్లం, నర్మాల

చెరువులు నిండలేదు



ముసురు వర్షం తప్ప.. భారీ వర్షాలు లేవు. మా ముస్తాబాద్‌లోని పులిచేరుకుంట, లింగంకుంటలోకి నీరు రాలేదు. చెరువుల్లోనూ నీరు లేదు. నిండు వర్షాకాలంలోనూ నీళ్ల లేక చెరువులు వెలవెలబోతున్నాయి. భూగర్భ జలాలు పెరగలేదు. బోర్లలో నీరున్న వారు వరినాట్లు వేసుకున్నారు. రైతులు భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

– తాళ్ల రాజు, ముస్తాబాద్

సబ్సిడీపై పనిముట్లు

- సన్నకారు, మహిళ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం
- మిగతా వారికి 40 శాతం
- 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

బోయినపల్లి(చొప్పదండి): సన్నకారు.. చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించే వ్యవసాయ యాంత్రీకరణ పథకం మళ్లీ అమలుకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోంది. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయా మండలాల వ్యవసాయాధికారుల ద్వారా రైతులకు సమాచారం అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60, 40 శాతం వాటాల చొప్పున ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. మొదట 2016–17లో యంత్రలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి 50 శాతం సబ్సిడీపై ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు అందించింది. తర్వాత ఇదే పథకాన్ని వ్యవసాయ యాంత్రీకరణ పథకంగా పేరు మార్చింది. అనంతరం నిధుల లేమితో అమలు నిలిచిపోయింది.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

జిల్లా వ్యాప్తంగా 1.39 లక్షల మంది రైతులు ఉన్నారు. సాగులో ఉపయోగపడే 186 రకాల పనిముట్లను సబ్సిడీపై పంపిణీ చేయాలని భావిస్తోంది. బ్యాటరీ పంపులు, తైవాన్ పంపులు, ట్రాక్టర్‌తో నడిచే పరికరాలు, డిస్కహారో, నాగళ్లు, రొటవేటర్లు, విత్తనాలు వేసే యంత్రం, పవర్ వీడర్, పవర్ టిల్లర్, బ్రష్ కట్టర్, గడ్డి చుట్టలు చుట్టే యంత్రాలు అందించనున్నారు.

ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 50 శాతం

సన్న, చిన్నకారు, మహిళా, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, మిగిలిన వారికి 40 శాతం రాయితీ వర్తిస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. లబ్ధి పొందే రైతులకు కనీసం ఎకరం వ్యవసాయ భూమితోపాటు మట్టి పరీక్షాపత్రం ఉండాలి. పరికరాలు కావాలనుకునే రైతులు తమ ఆధార్‌కార్డు, భూమి పాస్‌బుక్, ట్రాక్టర్ పరికరాల కోసం ఆర్సీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపికకు మండల కమిటీ

మండలానికి చెందిన ఎంఏవో, ఎంపీడీవో, తహసీల్దార్‌తో కలిపి మండల కమిటీ ఏర్పాటు చేశారు. వచ్చిన దరఖాస్తులను మండల కమిటీ పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. మండల కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీపై పరికరాలు అందుతాయి.

25 వరకు దరఖాస్తుల స్వీకరణ



వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై పనిముట్లు అందించేందుకు ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. సన్న, చిన్నకారు, మహిళ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, మిగతా వారికి 40 శాతం సబ్సిడీపై పరికరాలు అందచేయడం జరుగుతుంది. – కె.ప్రణీత, ఏవో, బోయినపల్లి



వీర్నపల్లి గ్రామపంచాయతీ ఆఫీస్ వద్ద క్యూలైన్‌లో రైతులు

క్యూలైన్‌లో ఎన్ని గంటలున్నా.. ఒకే బస్తా !

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలో సోమవారం యూరియా కోసం రైతులు భారీగా క్యూలైన్‌లో నిల్చున్నారు. 220 బస్తాలు రాగా.. 400 మంది రైతులు క్యూలైన్‌లో ఉన్నారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా మాత్రమే పంపిణీ చేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క బస్తా యూరియాను ఏం చేసుకోవాలని ప్రశ్నించారు.

భూకబ్జాల బాగోతం బహిర్గతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్లటౌన్: జిల్లాలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా బాగోతాన్ని బహిర్గతం చేసి ఇప్పటి వరకు ఎన్ని రికవరీ చేశారో ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సిరిసిల్లలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, సిరిసిల్ల నియోజకవర్గంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుచరులు సుమారు 2 వేల నుంచి 3వేలు ఎకరాల వరకు కబ్జా చేసుకున్నారని ఆరోపించారు. వారిలో కొందరిపై కేసులు పెట్టారని, కొంత మేరకు భూమి రికవరీ చేశారన్నారు. అయితే ఈ వ్యవహారంలో చిన్నా చితక వ్యక్తులపైనే చర్యలు తీసుకుంటూ, బడా నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ముస్తాబాద్ మండలంలోని సర్వేనంబర్లు 410, 608లో సుమారు 150 ఎకరాలు కబ్జాకు గురయ్యాయన్నారు. వీటిలో 50 ఎకరాల్లో స్టోన్‌క్రషర్ నడుస్తోందని పేర్కొన్నారు. సిరిసిల్ల కొత్తచెరువు డీసీఎంహెచ్‌వో పరిధిలో ఎంత భూమి కబ్జాకు గురైందో కలెక్టర్ విచారణ చేపట్టి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ స్పెషలాఫీసర్‌గా కలెక్టర్ ఉన్నా పట్టణంలో అనేక అక్రమ లేఅవుట్లు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు వివరణ ఇవ్వకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్టీ పార్లమెంటు కోకన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, గజభీంకార్ చందు, తిరుపతిరెడ్డి, శ్రీహరి, శ్రీధర్, శ్రీనివాస్, దేవరాజు, శేఖర్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బోయినపల్లి(చొప్పదండి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రజిత సూచించారు. కొదురుపాక పీహెచ్‌సీని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నులిపురుగుల నివారణ చర్యలపై ఆరా తీశారు. వైద్యాధికారి రేణు ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



వేములవాడ: భక్తుల రద్దీ పెరుగుతుండడం, వర్షాలు కురుస్తుండడంతో ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఈవో రాధాభాయి సూచించారు. సోమవారం పరిశీలించి.. క్యూలైన్లలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఎస్పీఎఫ్ ఏఎస్సై మహేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మహాలింగార్చన



వేములవాడ: శ్రావణ సోమవారం సందర్భంగా రాజన్న ఆలయంలోని మహామంటపంలో అర్చకులు మహాలింగార్చన నిర్వహించారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు.

పాపన్నగౌడ్ మార్గం ఆచరణీయం



పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో నాయకులు

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: నిరంకుశ పాలనపై దండయాత్ర చేసి బీసీల్లో రాజకీయ చైతన్యాన్ని రగిలించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మార్గం ఆచరణీయమని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సిరిసిల్లలో సోమవారం నిర్వహించిన పాపన్నగౌడ్ జయంతికి హాజరై మాట్లాడారు. కులమతాలకతీతంగా అందరినీ ఏకం చేసి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుర గోవర్ధన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణగౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నివాళి..



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న అధికారులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి బీసీ సంక్షేమాధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు, గౌడ సంఘం ప్రతినిధులు గోవర్ధన్‌గౌడ్, బుర్ర నారాయణగౌడ్, పులి లక్ష్మీపతిగౌడ్, బొల్గం నాగరాజుగౌడ్, అమరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం

సిరిసిల్లటౌన్: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి సోమవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా శీలం రాజు, బండ మల్లేశం, వెంకటేశ్వర్‌రావు, సంతోష్‌రెడ్డి, బర్కం వెంకటలక్ష్మి, మార్త సత్తయ్య, ప్రధాన కార్యదర్శులుగా సిరికొండ శ్రీనివాస్, పొన్నాల తిరుపతిరెడ్డి, కరెండ్ల మధుకర్, కార్యదర్శులుగా బుగ్గారెడ్డి, కర్నె హరీష, సురేందర్‌రావు, నంబ్యారపు వెంకటేశ్, మీస సంజీవ్, ధరావత్ రజిత, కోశాధికారిగా భాగయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా జూకంటి అఖిల్, మీడియా కన్వీనర్ రాజురావు, ఐటీ ఇన్‌చార్జిగా ప్రకాశ్‌లను నియమించారు.

సొంతింటి కల సాకారం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ: ప్రజాప్రభుత్వ పాలనలో పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం నిర్వహించిన కడప పూజల్లో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం యజ్ఞంలా నిర్వహిస్తోందన్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు.

పాపన్న సేవలు చిరస్మరణీయం

సర్వాయి పాపన్న సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పాపన్నచౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

'త్రిఫ్ట్' డబ్బులు జమచేయాలి



సిరిసిల్లఅర్బన్: త్రిఫ్ట్ నేతన్న పొదుపు పథకానికి సంబంధించిన డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల, టెక్స్‌టైల్ పార్క్‌లోని పవర్‌లూమ్, అనుబంధ రంగాల కార్మికులకు రావాల్సిన త్రిఫ్ట్ డబ్బులు వెంటనే కార్మికుల ఖాతాల్లో జమచేయాలని కోరారు. మూషం రమేశ్, నక్క దేవదాస్, కూచన శంకర్, సత్యం, బెజగం సురేష్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాజీ పడే కేసులను గుర్తించండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ



అడిషనల్ ఎస్పీని అభినందిస్తున్న జిల్లా జడ్జీ

సిరిసిల్లకల్చరల్: రాజీ పడే కేసులను గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ సూచించారు. జిల్లా న్యాయస్థానంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా జడ్జీ నీరజ మాట్లాడారు. రాజీ కుదుర్చుకోగలిగే కక్షిదారులను సమన్వయం చేసి కేసుల పరిష్కారానికి దోహదం చేయాలన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు సమన్వయంతో లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. జిల్లా అదనపు న్యాయమూర్తి వి.పుష్పలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రవీణ్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, అడిషనల్ పీపీ చెలుమల సందీప్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీకి అభినందనలు

సిరిసిల్లక్రైం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రెసిడెంట్ మెడల్ అందుకున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్యను జిల్లా జడ్జి నీరజ అభినందించారు. కోర్టు ఆవరణలో సోమవారం పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య విధుల్లో చూపిన తెగువ, దీర్ఘకాలికంగా ప్రజలకు అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం మెడల్‌కు ఎంపిక చేసింది.

యూరియా సరఫరాపై నిఘా

- ఎస్పీ మహేశ్ బి గీతే



హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

సిరిసిల్ల: వానాకాలం పంటల సాగుకు అవసరమైన యూరియా మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని, వచ్చే సీజన్ కోసం నిల్వ చేయొద్దని ఎస్పీ మహేశ్ బి గీతే కోరారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సోమవారం సమీక్షించారు. యూరియాను పరిశ్రమలకు, పొరుగు జిల్లాలకు తరలించకుండా నిఘా ఉంచాలని సూచించారు. మోతాదుకు మించి వినియోగించొద్దని కోరారు. అంతకు ముందు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావులతో కలిసి యూరియా, ఎరువుల లభ్యతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం

సిరిసిల్లక్రైం: జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న శివకుమార్‌కు జిల్లా పోలీస్ యంత్రాంగం బాసటగా నిలిచింది. రూ.55వేలు జమచేసి ఆయన కుటుంబ సభ్యులకు సోమవారం ఎస్పీ మహేశ్ బీ గీతే చేతులమీదుగా అందించారు. తోటి సిబ్బంది ఆపదలో ఉన్నప్పుడు ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఆర్ఐలు యాదగిరి, రమేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

బాధితులకు భరోసాగా గ్రీవెన్స్ డే

సమస్యల పరిష్కారం లక్ష్యంగా, బాధితులకు భరోసాగా ఉండేందుకు ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 ఫిర్యాదులు స్వీకరించినట్లు వివరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్‌చేసి సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సిరిసిల్లటౌన్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో విత్తన గణపతి విగ్రహాల పంపిణీ చేపట్టారు. ఆగయ్య మాట్లాడుతూ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా విత్తన గణపతి విగ్రహాలను పార్టీ నాయకులకు అందజేశారు. చీటి నర్సింగరావు, గూడూరి ప్రవీణ్‌కుమార్, ఆకునూరి శంకరయ్య, కుంబాల మల్లారెడ్డి, కోడి అంతయ్య, కమల్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంట్లో జారిపడి వ్యక్తి మృతి


మహ్మద్ అతిక్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గంజ్‌రోడ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అతిక్ (38) తన ఇంట్లో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందాడు. అతిక్ ఆదివారం సాయంత్రం తన ఇంట్లో కాలుజారి పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విషజ్వరంతో పారిశుధ్య కార్మికుడు..


స్వామి (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో పని చేస్తున్న జుట్టు స్వామి విషజ్వరంతో సోమవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్వామి వారంరోజులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందాడు. అయినా జ్వరం తగ్గలేదని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్ (35) అనే వ్యక్తి ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్ భార్య మూడు నెలల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుంచి రాజశేఖర్ ఒంటరితనంతో బాధపడుతూ తీవ్ర ఆందోళనలో ఉన్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి బందెల గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలో ఆదివారం రాత్రి రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయాల్లో రెండున్నర తులాల బంగారం, 59తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. గ్రామస్తుడు పూదరి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ట్యాక్సీడ్రైవర్‌కు రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్: సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ.. వాహనాన్ని అజాగ్రత్తగా.. నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన ట్యాక్సీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్నపద్మావతి సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన 12 మంది మహిళలు రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో జరిగిన ఓ శుభకార్యానికి ఓ మినీటాక్సీలో వెళ్లారు. మోరపల్లి శివారులో డ్రైవర్ పరాంకుశంవంశీకృష్ణ సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి రోడ్డుపక్కనున్న కల్వర్టును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న తోట్ల గంగవ్వ అక్కడికక్కడే చనిపోయింది. మిగతావారు గాయపడ్డారు. దీనిపై బాధితురాలు రాధ ఫిర్యాదు మేరకు అప్పటి జగిత్యాల రూరల్ ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేశారు. సీఐ కృష్ణకుమార్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె. నరేశ్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో వంశీకృష్ణకు రెండేళ్ల జైలు, జరిమానా విధించారు.



చిత్రం..



జ్ఞాపకాల పత్రం

- చరితకు చెరిగిపోని సాక్ష్యం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

విద్యానగర్(కరీంనగర్)/సిరిసిల్ల: ఫొటో.. చెదిరిపోని జ్ఞాపకం. గతించిన కాలాన్ని కళ్ల ముందుంచే సాక్ష్యం. మదిలో మెదిలే భావాలను కళ్ల ముందు నిలిపే ఛాయాచిత్రం. ఫొటోగ్రఫీకి సృజనాత్మకత తోడైతే అద్భుత చిత్రాలు కళ్లముందుంటాయి. మదిని పులకింపజేసి.. మనసును తట్టిలేపి.. మధురమైన అనుభూతులను పదిలం చేసేది ఫొటో. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు.. జిల్లా వాసుల ప్రతిభపై ప్రత్యేక కథనం.

కరీంనగర్‌లో తొలి ఫొటో స్టూడియోలు


1961 ప్రాంతంలో కరీంనగర్‌లో ఫొటో స్టూడియోలు ఏర్పాటయ్యాయి. కరీంనగర్‌లోని క్లాక్‌టవర్ వద్ద ఏవీఎం ఫొటో స్టూడియో, తిలక్‌రోడ్‌లో అజంతా ఫొటో స్టూడియోను ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన ఏలేటి వేణుమాధర్‌రెడ్డి 1961 జనవరి 1న ఆయన పేరుతో ఏవీఎం స్టూడియో ప్రారంభించారు. మూడేళ్ల తర్వాత గురుదత్త నిర్మాత సారథ్యంలో ముంబైలో రూపొందిన మొదటి స్కోప్ సినిమాకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశారు. బ్లాక్ అండ్ వైట్ మాన్యువల్ నుంచి 35 ఎంఎం మినియేచర్ ఫిలిం, కలర్ ప్రాసెసింగ్ కంప్యూటర్ వరకు కొనసాగారు. ఆయన వాడిన 1945 నాటి రోలిఫ్లెక్స్, ఎగ్జాక్ట, మన్య, కేబినేట్, ఫుల్‌సైజ్‌ల నెగెటివ్‌ల బాడీ కెమెరాలు ఇప్పటికి వాళ్ల ఇంట్లో భద్రంగా ఉన్నాయి. ఆయన నలుగురు కొడుకులు ఈ రంగంలోనే రాణిస్తున్నారు.

➡ ఫొటోగ్రఫీ డే గురించి

ఫ్రెంచ్ దేశస్తుడైన డాగురే 1839లో మొదటిసారి ఫొటోగ్రాఫిక్ ప్రాసెస్ కనిపెట్టి అదే సంవత్సరం ఆగష్టు 19న ప్రపంచానికి పరిచయం చేశాడు. సిల్వర్ అయొడైడ్ రసాయనంతో చిత్రానికి శాశ్వతత్వం కల్పించవచ్చని ప్రతిపాదించాడు. 1842 నుంచి 1880 మధ్య కాలంలో ఇండియలో ఫొటోగ్రఫీ పరిశ్రమ విస్తరించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి పోర్ట్రయిట్ స్టూడియోను దీన్ దయాళ్ కెన్నడీ అనే మహిళ స్థాపించింది. 1960 నాటికి స్టూడియో ఫొటోగ్రఫీ, 1980 నాటికి కంప్యూటర్‌తో కలర్ ఫొటోగ్రఫీ విస్తరించింది. రాజా త్రయంబక్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొదటి సారి 1957లో ఫొటోగ్రఫీ సొసైటీ ప్రారంభమైంది.

➡ ఉమ్మడి జిల్లా ప్రస్థానం

1940లో ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్‌లో మొదటి ఫొటోస్టూడియో నెలకొల్పారు. ప్రతిష్టాత్మక ఫెలోషిప్ ఆఫ్ రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ (ఇంగ్లాండ్) సాధించిన ఉమ్మడి రాష్ట్రంలోనే ఏకైక వ్యక్తి కోరుట్లకు చెందిన ఫొటోగ్రాఫర్ బండి రాజన్‌బాబు. 1987లో నగ్న చిత్రాలపై థీసిస్ సమర్పించి రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందారు. జగిత్యాలకు చెందిన అల్లె శ్రీకాంత్, కోరుట్లకు చెందిన బండి వెంకటరమణ, కరీంనగర్‌కు చెందిన బాబురెడ్డి, వేణు, రాజు, సంపత్‌కుమార్, వాసు, గంగాధర్, సదానందం, ఆత్మారాం, వేములవాడకు చెందిన రాజయ్య, జగిత్యాలకు చెందిన రామ్మోహన్, సతీష్, సిరిసిల్లలో ఎం.సి. శేఖర్, బోడ రవీందర్, కోడం దేవేందర్, వంకాయల శ్రీకాంత్, కోరుట్లకు చెందిన నాగరాజు, రాజేశం, శేఖర్, మహేందర్, మారుతి, మెట్‌పల్లి రాము, మల్యాల శ్రీనులు, ఎల్లారెడ్డిపేటకు చెందిన ప్రభాకర్‌రెడ్డి, సిరిసిల్లకు చెందిన శంకర్ మరెందరో ఫొటోగ్రఫీలో సృజనాత్మకతను జోడించి రాష్ట్ర స్థాయి అవార్డులు పొందారు.



➡ ప్రీ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ

ఏ ఫంక్షన్ జరిగిన, ఎక్కడికి వెళ్లిన సెల్‌ఫోన్లతోనే ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రీ వెడ్డింగ్ ఫొటోగ్రఫీపై కొత్తగా జంటలు ఉత్సాహం చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా తమకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకుని ప్రీ వెడ్డింగ్ ఫొటోలతోపాటు పెళ్లి వేడుకలను ఫొటోగ్రాఫర్లతో తీయించుకుంటున్నారు.

రీళ్ల నుంచి డిజిటల్



నాడు రీళ్లతో ఫొటోలు తీసేవాళ్లం, సాంకేతిక ప్రగతిలో నేడు డిజిటల్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. సెల్‌ఫోన్ కెమెరాలు, ఇంటింటికీ కెమెరాలు వచ్చినప్పటికీ ఫొటో స్టూడియోలకు ఆదరణ తగ్గలేదు. రీళ్ల పద్ధతి పోయి, డిజిటల్ కెమెరాలు, ప్రింటింగ్ యంత్రాలు ప్రవేశించడంతో ఈ ప్రక్రియ పూర్తిగా సులభతరమైంది. – ఆవుల నరేశ్, ఫొటోగ్రాఫర్, జ్యోతినగర్, కరీంనగర్

ఎన్నో మార్పులు



మా చిన్నప్పుడు ఫొటో అంటే ఓ క్రేజ్. ఏదైనా ఫంక్షన్ జరిగితే ఫొటోగ్రాఫర్ వచ్చి ఫొటోలు తీయడం, స్టూడియోకి వెళ్లి ఫొటోలు దిగడం చాలా కొత్తగా అనిపించేది. ఇప్పుడు సెల్‌ఫోన్‌లో అన్ని ఫంక్షన్‌లు, అన్ని సందర్భాల్లో ఫొటోలు తీసుకోవడం, మెమొరీ కార్డుల్లో భద్రపరచుకుంటున్నాం. – వల్లెర్ల శ్రీనివాస్, అశోక్‌నగర్, కరీంనగర్

అంతర్జాతీయ గుర్తింపు



సిరిసిల్లకు చెందిన ఫొటోగ్రాఫర్ మేర్గు చంద్రశేఖర్(ఎంసీ శేఖర్)కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దక్షిణాఫ్రికా పర్యాటక గిరిజనశాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిలా ఆర్ట్ ఆఫ్ ఫొటోగ్రఫీలు సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచస్థాయి పోటీల్లో శేఖర్ తీసిన 'హార్టీస్మైల్' బంగారు పతకం సాధించింది. అంతకుముందే శేఖర్ దశాబ్దకాలంగా గిరిజన జీవనశైలిపై, సామాజిక అంశాలపై ఫొటోలు తీసి పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ స్థాపించారు. ఔత్సాహికులైన ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల సాలర్‌జంగ్ మ్యూజియంలో రాష్ట్రస్థాయి ఫొటో వర్క్‌షాప్ నిర్వహించారు. ఎం.సీ.శేఖర్ తీసిన ఫొటోలకు 98 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కాయి.

అభిరుచితో రాణిస్తున్న పోలీస్


దాసరి మల్లేశ్ తీసిన ఫొటో


దాసరి మల్లేశ్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన దాసరి మల్లేశ్ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకున్న మల్లేశ్ ఫొటోగ్రఫీలోని మెలకువలను నేర్చుకొని.. తీరిక సమయంలో తన కళాభిరుచిని తీర్చుకుంటున్నారు. ఫొటో వర్క్‌షాప్‌లలో పాల్గొని అద్భుత ఫొటోలు తీసి బహుమతులు అందుకున్నారు. పల్లె ప్రజల జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలపై తీసిన ఫొటోలకు ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల జరిగిన జోనల్‌స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా మూడో బహుమతి అందుకున్నారు.

రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- వేగంగా దూసుకొచ్చి బస్సును ఢీకొట్టిన కారు
- నుజ్జునుజ్జయిన వాహనం.. వేలాడిన మృతదేహం


ఎలక్ట్రికల్ బస్సును ఢీకొన్న కారు


సంఘటన స్థలంలో మృత్యుంజయ్ మృతదేహం

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ స్టేజీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం.. కరీంనగర్ నుంచి కొంగారి మృత్యుంజయ్ (32) భార్య, కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్తున్నారు. ముందున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో రోడ్డుపై కారు అదుపుతప్పింది. డివైడర్ అవతలివైపు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు సగం బస్సు కిందికి చొచ్చుకుపోయింది. డ్రైవర్ పక్కసీట్లో కూర్చున్న మృత్యుంజయ్ అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడు మత్యుంజయ్ హైదరాబాద్‌కు చెందిన వాడు. ఈయన ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నట్లు సమాచారం.

బహిరంగ ప్రదేశంలో కోడె టికెట్లు ?

- ఉద్యోగుల తీరుపై అనుమానాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో ప్రధాన మొక్కు అయిన కోడె టికెట్లు ఆలయం బయట ప్రదేశంలోకి రావడం కలకలం రేపాయి. కోడెమొక్కు చెల్లించే భక్తులు రూ.200 పెట్టి టికెట్ కొని కోడెతో ప్రదక్షిణ చేసి ప్రధాన ద్వారానికి ఎదురుగా కట్టేస్తారు. ఈక్రమంలో కోడె టికెట్లు పరిశీలించేందుకు రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది కోడె టికెట్లు తీసుకుని చించివేస్తారు. అయితే ఆ చించివేసిన టికెట్లు సోమవారం ఆలయంలోని స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌పై దర్శనమిచ్చాయి. ఇక్కడి ఎలా వచ్చాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ ఉద్యోగులే రీసైక్లింగ్ చేస్తూ డబ్బులు దండుకునేందుకు ఇలా తెచ్చి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఈవో రాధాభాయి మాట్లాడుతూ గతంలో ఈ టికెట్లను ఓపెన్‌స్లాబ్‌పై వేసి ఉంటారని, ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇసుక వివాదం..

మెట్‌పల్లి రూరల్: ఇసుక విషయమై జరిగిన వివాదంపై మెట్‌పల్లి పోలీసులు నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఈనెల 10న అగ్నిప్రమాదం చోటుచేసుకున్న విషయం తెల్సిందే. ప్రమాదంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా రెండు రోజులైనా అదుపులోకి రాలేదు. యార్డులో గన్నీసంచులు కాలుతుండగా వాటిపై ఇసుక పోసి మంటలు ఆర్పాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆత్మకూర్ పెద్దవాగు నుంచి ఈనెల 12న ట్రాక్టర్లలో ఇసుక తరలించారు. ఆ సమయంలో పలువురు ట్రాక్టర్లను అడ్డుకుని వివాదం చేశారు. అక్కడే ఉన్న తనను కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడారని వీడీసీ చైర్మన్ రమేశ్ మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి చెందిన తాటిపెల్లి సురేశ్‌రెడ్డి, తిప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కేశిరెడ్డి నవీన్‌రెడ్డి, శోభపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు సోమవారం ఆత్మకూర్‌కు వెళ్లి విచారణ జరిపారు. ఆయన వెంట మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.







రాజన్నకు శ్రావణ మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 60 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. ట్రాఫిక్ పెరిగిపోవడంతో టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెరుకు రైతుకు రవాణా భారం

- ఫ్యాక్టరీ ప్రారంభం కాక అదనపు ఖర్చులు
- టన్నుకు రూ.700 వరకు భారం
- ఆదుకోవాలని రాష్ట్ర మంత్రులకు విన్నపాలు


చెరుకు పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఏకైక ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని ప్రారంభించాలని రైతులు ఏళ్ల తరబడి కోరుతున్నా.. పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా.. చక్కెర ఫ్యాక్టరీ మాత్రం ప్రారంభం కావడం లేదన్నది ఇక్కడి రైతుల వేదన. దీంతో చెరుకు పంటపై మమకారం చంపుకోలేక.. రైతులు ఇతర జిల్లాలో ఉన్న ప్రైవేట్ చెరుకు ఫ్యాక్టరీతో ఒప్పందాలు చేసుకొని చెరుకును సాగు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీ సైతం చెరుకు రైతులకు అవసరమైన సదుపాయాలను కల్పించలేక నిర్లక్ష్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని ప్రారంభించాలని, అప్పటివరకు చెరుకు రైతులపై పడే రవాణా భారాన్ని ప్రభుత్వం భరించాలని చెరుకు రైతులు ఇటీవల జగిత్యాలకు వచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మన్‌కుమార్, వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందించారు.

1,500 ఎకరాల్లో సాగు

జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉండడంతో.. ప్రస్తుతం చెరుకు పంటను దాదాపు 1,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఒకప్పుడు 10వేల ఎకరాలకు పైగా చెరుకు పంట ఉన్నా.. ఫ్యాక్టరీ మూసేయడంతో విస్తీర్ణం తగ్గిపోయింది. గతంలో జిల్లాలో ఉన్న చెరుకు ఫ్యాక్టరీ ప్రభుత్వానిది కావడంతో.. పంట సాగు చేసే రైతులకు ఎరువులు, విత్తనం, కటింగ్, రవాణా వంటి వాటిపై ప్రోత్సాహకాలు అందించేది. ఇప్పుడు జిల్లాలో చెరుకు సాగు చేసే రైతులు కామారెడ్డి జిల్లాలో ఉన్న ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును పంపిస్తుండడంతో.. రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా, లేనిపోని నిబంధనలు పెట్టి జిల్లా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

రవాణా భారం..

ప్రైవేట్ ఫ్యాక్టరీ ఎలాంటి సబ్సిడీలు ఇవ్వకపోయినా.. చెరుకు పంటపై ఆసక్తితో చెరుకును సాగు చేసిన రైతులకు రవాణా భారం పెద్ద సమస్యగా మారింది. జిల్లా నుంచి కామారెడ్డి చక్కెర ఫ్యాక్టరీ కనీసం 150 కి.మీ. వరకు ఉంటుంది. గతంలో ముత్యంపేట ఫ్యాక్టరీ వారు 15 కి.మీ. వ్యాసార్థంలో రవాణా భారం వేసేవారు కాదు. 15 కి.మీ. తర్వాత ఉన్న రైతులు ఎంతో కొంత మొత్తం చెల్లించేవారు. ఇప్పుడు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చెరుకు సాగు చేసేవారు కామారెడ్డికి లారీల్లో చెరుకు తరలించడం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం రైతులు చెరుకును కామారెడ్డి ప్రైవేట్ ఫ్యాక్టరీకి తరలించేందుకు టన్నుకు దాదాపు రూ.700 వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇలా దాదాపు జిల్లా చెరుకు రైతులు రవాణా పేరిట రూ.4.50కోట్ల వరకు నష్టపోతున్నారు.

దిగుబడులు ఘనం.. వచ్చేది స్వల్పం

ఇక్కడి చెరుకు రైతులు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించడంతో ఎకరాకు 40 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు. ప్రస్తుతం చెరుకు టన్ను ధర రూ.3,470 వరకు ఉండగా, అందులో చెరుకు కటింగ్ కోసం కూలీలకు టన్నుకు రూ.860, రవాణా కోసం టన్నుకు రూ.700 వరకు ఖర్చు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. పంటకు అవసరమైన రసాయన ఎరువులు, కలుపు వంటి వాటి కోసం మరింత ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఇతర ప్రాంతాలకు చెరుకు తరలించడం వల్ల రైతులకు పెద్దగా మిగిలింది ఏమీ లేదు.

ప్రభుత్వం భరించాలి



చెరుకు రైతులపై పడే రవాణా భారాన్ని ప్రభుత్వం భరించాలి. చెరుకు పండిస్తే మాకు ఆదాయం కాకుండా ఖర్చులు మిగులుతున్నాయి. త్వరగా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించి చెరుకు రైతులకు అండగా ఉండాలి. – మామిడి మహేందర్‌రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి

మమకారం చంపుకోలేకే..



చెరుకు పంటపై మమకారం చంపుకోలేక సాగు చేస్తున్నాం. ఇక్కడ ఫ్యాక్టరీ ప్రారంభం కాకపోవడంతో కామారెడ్డికి తరలించాల్సి వస్తోంది. రవాణా భారం, కటింగ్ వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాం. – పీసు రాజేందర్‌రెడ్డి, మూడుబొమ్మల మేడిపల్లి, మెట్‌పల్లి